


# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## అమ్మాయి పెళ్ళి

**"అది ఈ ఇంట్లో** అడుగుపెట్టిందంటే నేను ఇంట్లోంచి వెళ్ళిపోతాను" బుద్ధబాబు కటవుగా చెప్పాడు.

కత్తిపీట ముందు కూర్చుని సొరకాయ చెక్కుతీస్తున్న కనకదుర్గ ఓసారి తలెత్తి ఆయనవంక చూసి, మళ్ళీ కత్తిపీట మీదకి దృష్టిని పోనించింది.

ఆ చిన్న గదిలో అటూ ఇటు తిరగడంవల్ల బుద్ధబాబు మోకాలు నిశ్శబ్దంగా చప్పుడు చేసింది. కుడి మోకాలుని చేత్తో రాసుకుంటూ ప్లాస్టిక్ కుర్చీలో కూలబడి ఆక్రోశంగా చెప్పాడు.

"అది నా కూతురు కాదు. నేను దాని తండ్రిని కాదు."

కనకదుర్గ నవ్వుకోవడం గమనించి కోపంగా అడిగాడు.

"నా బాధ నవ్వుగా ఉందా నీకు?"

"మీరూ, మీ అమ్మ నా కడుపున ఓ నలుసు పుట్టాలని ఎన్ని పూజలు, వ్రతాలు, ఉపవాసాలు చేయించారో గుర్తొచ్చింది. రెండు మూడుసార్లు డిఎన్‌సి కూడా చేయించారు. గుళ్ళల్లో తడి బట్టల్తో పొర్లు దణ్ణాలు పెట్టించారు. మొత్తానికి ఈ నలుసు కడుపున పడి నా నలభైయ్యో ఏట మీ నలభై రెండేళ్ళ వయసులో అమ్మా నాన్నలయ్యాం. ఇప్పుడేమో మీరు అది నా కూతురు కాదు. నేను దాని తండ్రిని కాదంటే మరి నవ్వక దేవనా?' ఆవిడ సొరకాయని అడ్డంగా కోసి చిన్న ముక్కలుగా తరగసాగింది.

"నా పరువు తీసింది. బయట మొహం చెల్లకుండా చేసింది" డెబ్బై ఐదేళ్ళ బుద్ధబాబు బలహీనంగా చెప్పాడు.

కనకదుర్గ కత్తిపీట తీసి కడిగిపెట్టి, సొరకాయ ముక్కల పళ్ళెం, తొక్కలతో నిండిన పేపర్ ముక్కని తీసుకుని వంటగదిలోకి వెళ్ళింది.

బుద్ధబాబు కూతురు ముప్పైమూడేళ్ళ సరసీరుహ పదిరోజుల క్రితం తల్లితండ్రులతో చెప్పింది.

"నాన్నా. మా కాలేజ్‌లో దినకర్ అనే లెక్చరర్ ఉన్నారు. ఇంతకాలం బాధ్యతల వల్ల పెళ్ళి చేసుకోలేదుట. ఇప్పుడన్నీ తీరిపోయాయి. నన్ను పెళ్ళి చేసుకుంటానన్నారు."

"మన కులమేనా?" బుద్ధబాబు శాంతంగా అడిగాడు.

"కాదు"

"అయితే వద్దు."

"కాని నేను సరేనని చెప్పా నాన్నా. నా వయసుకి మొదటి పెళ్ళివాళ్ళు దొరకడం కష్టం. దినకర్ నన్ను ఇష్టపడుతున్నారు. వాళ్ళ ఇంట్లో వాళ్ళని ఒప్పిస్తానన్నారు. మీరు నో అంటారనుకోలేదు నాన్నా" సరసీరుహ కన్నీళ్ళతో చెప్పింది.

కనకదుర్గ ఏమీ మాట్లాడకుండా నిశ్శబ్దంగా జరిగేది చూస్తూండిపోయింది.

"బుద్ధిమంతురాలివి. చదువుల సరస్వతివి. నీకు కులాంతరం చేసుకునే ఖర్మ ఏమిటమ్మా? నాకు ఇష్టంలేదు" సంభాషణ ముగిసినట్లుగా బుద్ధబాబు అక్కడినించి లేచి వెళ్ళిపోయాడు.

రెండు రోజుల తర్వాత సరసీరుహ ఓ యువకుడితో వచ్చి పరిచయం చేసింది.

"దినకర్ నాన్నా."

బుద్ధబాబు ఏమీ మాట్లాడలేదు. కనకదుర్గ కుర్చీలాగి అభిమానంగా చెప్పింది.

"కూర్చోబాబూ"

సరసీరుహ కంటే రెండు మూడేళ్ళు పెద్దవాడైన దినకర్ వంకపెట్టడానికి వీల్లేదన్నట్లుగా ఉన్నాడు.

"జంట బాగుంది" అనుకుంది కనకదుర్గ.

అతను దాదాపు అరగంటసేపు కూర్చున్నా బుద్ధబాబు నోరెత్తలేదు. ఒక్కమాట కూడా మాట్లాడలేదు. దినకర్ అవమానంతో వెళ్ళిపోయాడు.

ఈరోజు పొద్దున సరసీరుహ తన వస్తువులన్నీ సర్దుకుని తండ్రితో చెప్పింది.

"వెళ్తున్నాను నాన్నా. మధ్యాహ్నం మేం గుళ్ళో పెళ్ళి చేసుకుంటున్నాం. దినకర్ ఫేమిలీ నన్ను ఒప్పుకున్నారు. నీ గురించి తెలిసి, వాళ్ళే పెళ్ళి చేస్తామన్నారు. తర్వాత నువ్వెటూ మమ్మల్ని రానివ్వవు కాబట్టి నా సామానుతో వెళ్ళిపోతున్నాను."

బుద్ధబాబు అటు తిరిగి కూర్చున్నాడు. సరసీరుహ ఆయన కాళ్ళకి దణ్ణం పెట్టి తల్లివంక చూసింది. కనకదుర్గ కన్నీళ్ళతో మెరిసే చిరునవ్వుతో కూతురు నుదుట చుంబించి, తన మెళ్ళోని ఒంటిపేట గొలుసుని ఆమె మెడలో వేసి చెప్పింది.

"పదికాలాలపాటు పిల్లా పాపలతో చల్లగా ఉండమ్మా."

సరసీరుహ తల్లిని ఓసారి కౌగలించుకుని కన్నీళ్ళు తుడుచుకుంటూ తన పెట్టెతో వెళ్ళిపోయింది.

కనకదుర్గ సొరకాయ, కత్తిపీటలతో ముందు గదిలోకి వచ్చి కత్తిపీట ముందు కూర్చుంది.

కనకదుర్గ వంట ముగించి ముందుగదిలోకి వచ్చేసరికి బుద్ధబాబు అలాగే కూర్చుని ఉన్నాడు. ఆవిడ కొబ్బరి నూనె సీసా తీసుకుని ఆయన కాళ్ళ దగ్గర కూలబడి, నూనెని చేతిలో వేసుకుని ఆయన మోకాళ్ళకి రాయసాగింది.

"ఈ పాటికి పెళ్ళయిపోయి ఉంటుందంటావా?" బుద్ధబాబు బలహీనంగా అడిగాడు.

"ఇవాళ ముహూర్తాలేమున్నాయ్? పన్నెండుగంటలకి అభిజిత్ లగ్నంలో చేస్తారేమో" ఆవిడ చెప్పింది.

"హుం" బుద్ధబాబు మూలిగాడు.

కనకదుర్గ నూనె రుద్దుతూ మౌనంగా ఉండిపోయింది.

"నీకు బాధగా లేదు?" అడిగాడు.

"ఎందుకు? శుభమా అని పిల్ల పెళ్ళి చేసుకుంటూంటే" ఎదురు ప్రశ్న వేసింది.

"పైగా అబ్బాయి గవర్నమెంట్ కాలేజ్‌లో లెక్చరర్."

"మనకులం కాదు."

దెబ్బై పైబడ్డ కనకదుర్గ పెద్దగా నవ్వింది. ఆవిడలా నవ్వి చాలాకాలమైంది.

"ఎందుకా నవ్వు?" బిత్తరబోయిన బుద్ధబాబు అడిగాడు.

"మీ నటనకి. మీలోని ఈ కోణాన్ని చూడలేదు సుమండీ."

ఆవిడ నవ్వాపుకుంటూ చెప్పింది.

"నటనా?"

"మరి? పిల్లలో అని కలవరించారు కాని పిల్ల పుట్టాక అది సుఖంగా పెరగడానికి సరిపడా సంపాదించారా? అది మనకులం వాడిని పెళ్ళి చేసుకుంటానన్నా ఒప్పుకునే వాళ్ళా? మీ దగ్గర పిల్ల పెళ్ళి చేయడానికి కాదు, దానికో పట్టుచీర కొనడానికైనా డబ్బుందా?"

ఆవిడ మరికాస్త నూనె చేతులో వంచుకుని ఆయన కాళ్ళకి రుద్దుతూ చెప్పింది.

"పెన్షన్ రాని ప్రైవేట్ ఉద్యోగం. తాతలనాటి ఈ కొంపలేకపోతే చెట్టుకింద కాపురం పెట్టే పరిస్థితి. పద్దెనిమిదేళ్ళకి దాని డిగ్రీ అవగనే పెళ్ళి చేద్దామన్నాను. 'నా కూతురు చదువుల సరస్వతి. అది యం.ఎస్.సి చదవాలి' అన్నారు. చదివింది. ఫీజులు మాత్రం మీరు కట్టారా? గవర్నమెంట్ ఇచ్చిన ఫ్రీ సీట్, స్కాలర్ షిప్పులు, తర్వాత దాని ఇరవైరెండేళ్ళప్పుడు చెప్పాను. ఇకనైనా పెళ్ళిచేద్దామన్నాను. 'అది చదువుల సరస్వతి. పెళ్ళి ఎవరైనా చేసుకుంటారు. పి.హెచ్.డి. ఎంతమంది చేస్తారు? అది డాక్టర్ అవాలి' అన్నారు. అది డాక్టర్ కాకుండానే ముప్పై మూడేళ్ళు వచ్చాయి. దానికి మాత్రం కోరికలు ఉండవా? మనం నలభైల్లో తల్లితండ్రులమయ్యాం మరి. చదువు వంకపెట్టి పెళ్ళి చేయకుండా లాక్కొస్తున్నారు. కారణం నాకు తెలీదా? మీ దగ్గర పైసా లేదు. బేంక్‌లో డబ్బు తీస్తే తర్వాత మనం తింటానికి ఉండదు. పెళ్ళంటే ఎంత లేదన్నా నాలుగైదు లక్షలవుతుంది. ఇప్పుడా అబ్బాయిని కాదనడానికి కారణం నాకు తెలుసు."

"కారణమా?" ఆయన నీరసంగా అడిగాడు.

"అవును. ఒప్పుకుంటే పెళ్ళి చేయాలి. అదే బెట్టుగా ఉంటే వాళ్ళే చేసుకుంటారు. పెళ్ళి ఖర్చులు, పెట్టుపోతలు ఉండవు. పిల్లకో నలుసు పుట్టాక నెమ్మదిగా రాకపోకలు సాగించచ్చు. మీ ఆర్థిక బలహీనత నాకు తెలుసు. అందుకే నేను మీతో దెబ్బలాడలేదు. మీరా అబ్బాయితో ఒక్క మాట మాట్లాడకపోవడానికి కారణం కూడా కాబోయే అల్లుడనే గౌరవంతోనే. లేకపోతే కప్పెగిరిపోయేలా అరిచేవాళ్ళు కదూ?" మృదువుగా అడిగింది.

బుద్ధబాబు చేతుల్లో మొహం దాచుకుని వెక్కి వెక్కి ఏడ్చాడు. ఆవిడ ఆయన్ని గుండెలకి పొదుపుకుని నూనె చేతులు ఆయన తలకి రాస్తూ చెప్పింది.

"మనం దాని సంపాదన ఆశించలేదు. కేవలం మన భవిష్యత్తు గురించి భయపడ్డాం. మీరు లేచి స్నానం చేసి భోంచేస్తే, నేను వెళ్ళి అమ్మాయి పెళ్ళి చాటుగా చూసి వస్తా."

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments